క్లుప్తంగా

కళాజాతా



మల్లన్న చరిత్రను వివరిస్తున్న కళాకారులు

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు గ్రామం రైస్‌మిల్ సెంటర్‌లో యువ యూత్ నిర్వహించిన దుర్గామాత నవరాత్రి ఉత్సవాల్లో శ్రీ కొమురవెల్లి మల్లన్న చరిత్రను కళాకారులు నాలుగు రోజుల పాటు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో పూజలు అయ్యాక పాటలతో డ్యాన్సులు వేసే సంస్కృతికి భిన్నంగా మల్లన్న స్వామి చరిత్రను కళారూపాల ద్వారా వినూత్న రీతిలో వివరించారు.

తిరుమల ఫౌండేషన్ సేవలు అభినందనీయం



విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందిస్తున్న రాజేందర్

కామేపల్లి: పేద విద్యార్థులకు తిరుమల ఫౌండేషన్ ఆధ్వర్యాన చేయూత అందిస్తూ అండగా నిలబడడం అభినందనీయమని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్ అన్నారు. కామేపల్లి మండలం ముచ్చర్లకు చెందిన తిరుమల ఫౌండేషన్ అధినేత చల్లా తిరుమల్‌రావు తన సంస్థ తరఫున ఇల్లెందు పట్టణానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థిని బత్తుల సాధ్వికతో పాటు ముచ్చర్లకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి రేగళ్ల సందీప్‌కు సుమారు రూ.80 వేలు విలువ చేసే ల్యాప్‌టాప్‌లను రాజేందర్ చేతుల మీదుగా శనివారం అందజేశారు. పేద విద్యార్థులకు సహకారం అందించేందుకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధినేతతో పాటు ప్రతినిధులు నాగరాజు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో తోడుంటాం..



మాట్లాడుతున్న మన్నేపల్లి సంజయ్

ఖమ్మం మామిళ్లగూడెం: సేవా కార్యక్రమాలకు ఆర్థిక సహకారం అందిస్తామని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త మన్నేపల్లి సంజయ్ అన్నారు. సీపీఎం ఖమ్మం టూ టౌన్ కమిటీ, బీవీకే కమిటీల సంయుక్త ఆధ్వర్యాన శనివారం ఖమ్మం మంచికంటి ఫంక్షన్‌లో జరిగిన ఉచిత మెడికల్ క్యాంప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. తన తండ్రి మన్నేపల్లి శ్రీహరిరావు జ్ఞాపకార్థం మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నాట్లు తెలిపారు. అనంతరం క్యాంపులో బీపీ, షుగర్, పక్షవాతం, ఎండోక్రైన్, చర్మవ్యాధులు, కంటి, చెవి, ముక్కు, గొంతు పేషెంట్లకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా సీనియర్ నాయకుడు వై.శ్రీనివాసరావు, సుబ్బారావు, వైద్యులు భారవి, రమణారెడ్డి, కె.సుధాకర్, కె.మోహన్‌రెడ్డి, డాక్టర్ ఎలమద్ది వినూష, పి.సుబ్బారావు, పార్టీ టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు ఎండీ అఫ్జల్, వాసిరెడ్డి వీరభద్రం, జె.వెంకన్న బాబు, పామర్తి వాసు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఓజీ
వినోద	కాంతార
సాయిరాం	ఓజీ
ఆదిత్య	కాంతార, మిరాయ్
శ్రీనివాస	ఇడ్లీ కొట్టు, మిరాయ్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	26	బచ్చలికూర	4
వంకాయ	40		20
బెండకాయ	16	పాలకూర	3
పచ్చిమిర్చి	56		20
కాకర	30	చుక్కకూర	3
బోడ కాకర	100		20
బీర	56	తోటకూర	4
దొండ	46		20
పొట్లకాయ	30	గోంగూర	4
చిక్కుడు	70		20
గోరుచిక్కుడు	50	మెంతికూర	3
క్యాబేజీ	28		20
క్యాలీఫ్లవర్	30	కొత్తిమీర	1
ఆలుగడ్డ	26		40
చామగడ్డ	26	పుదీన	1
క్యారెట్	50		20
క్యాప్సికం	80	-ఖమ్మం వ్యవసాయం	

ఎండి.. ప్రమాదం పొంచి ఉంది!

ఖమ్మం–ఇల్లెందు ప్రధాన రహదారిపై బూడిదంపాడు శ్మశానవాటిక సమీపాన ఒక ఎండిపోయిన చెట్టు ప్రయాణికుల ప్రాణాలకు ముప్పుగా మారింది. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రోడ్డుపై చెట్టు కొమ్మలు ఎప్పుడైనా విరిగిపడే ప్రమాదం ఉంది. ప్రజల భద్రత దృష్ట్యా సంబంధిత శాఖలు జోక్యం చేసుకుని చెట్టును వెంటనే తొలగించాలని కోరుతున్నారు.

– రఘునాథపాలెం



ఇల్లెందు రోడ్డులో బూడిదంపాడు వద్ద ఎండిన చెట్టు

వేళాపాళాలేని బస్సులు..

వస్తేనే అన్ని కలిసొస్తాయి.. లేకుంటే లేదు. వేళాపాళా లేని బస్సులతో స్థానిక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలో బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రధానసెంటర్‌లో ఖమ్మం, కోదాడ ఇతరత్రా ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఎండలో బస్సుల కోసం పడిగాపులు కాస్తున్నారు. సమయపాలన పాటించడంలో ఆర్టీసీ పూర్తిగా విఫలమవుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

– నేలకొండపల్లి



బస్ షెల్టర్ లేక ఎండలో ఆగిన బస్సులు

శోభాయమానంగా శోభాయాత్రలు

- మేళతాళాలు, నృత్యాలు, కోలాటాలతో అమ్మవారికి వీడ్కోలు
- ప్రత్యేక ఏర్పాట్ల నడుమ జలాశయాల్లో నిమజ్జనం



ఖమ్మంగాంధీచౌక్: వైరారోడ్డులో అమ్మవారి శోభాయాత్ర



ఖమ్మంగాంధీచౌక్: శ్రీనివాసనగర్ బెస్తకాలనీలో అమ్మవారి ఊరేగింపు

ఖమ్మంగాంధీచౌక్: పదకొండు రోజుల పాటు మండపాల్లో పూజలందుకున్న అమ్మవారిని శనివారం ఆనందోత్సాహాల నడుమ శోభాయమానంగా భక్తులు శోభయాత్రలు నిర్వహించి జలాశయాల్లో నిమజ్జనం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం సూచనల మేరకు మున్సిపాలిటీ సిబ్బంది, పోలీస్ యంత్రాంగం, ఇతర శాఖల అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో కాల్వొడ్డు మున్నేరు జలాశయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన క్రెయిన్లను, సిబ్బందిని, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచగా.. పోలీస్ యంత్రాంగం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. శరన్నవరాత్రుల నిర్వహకులు అమ్మవారికి కన్నుల పండుగగా శోభయాత్రలు జరిపి జలంలో నిమజ్జనం చేసి వీడ్కోలు పలికారు.



ఖమ్మంమయూరిసెంటర్: 51వ డివిజన్ గొల్లబజార్‌లో దుర్గామాత శోభాయాత్ర

సంప్రదాయంగా నవరాత్రులు..

ప్రభుత్వం నుంచి దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యాన శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో, జమ్మిబండపై ప్రత్యేకంగా సంప్రదాయ పద్ధతుల్లో అమ్మవారికి భక్తులు శరన్నవరాత్రి ఉత్సవాలను జరిపారు. జమ్మిబండపై ఏర్పాటు చేసిన అమ్మవారి శోభయాత్రను శనివారం సాయంత్రం జిల్లా పరిషత్ సెంటర్, పాత బస్టాండ్, పాత మున్సిపాలిటీ రోడ్డు, మధ్య గేటు, సుందర్ టాకీస్ రోడ్డు, వర్తక సంఘం, పొట్టి శ్రీరాములు రోడ్డు, కాల్వొడ్డు మీదుగా మున్నేరు నిమజ్జనం పాయింట్‌కు చేరుకుని అమ్మవారిని నిమజ్జనం చేశారు. నగర నలుమూలల నుంచి శోభయాత్రతో మేళతాళాలు, డప్పు చప్పుళ్లు, కోలాటాలు, నృత్యాలు, బాణాసంచా పేళుళ్లతో వచ్చిన అమ్మవారి విగ్రహాలను మున్నేరులో నిమజ్జనం చేశారు.



ఖమ్మం అర్బన్: 12వ డివిజన్ రాధాకృష్ణనగర్‌లో అమ్మవారి శోభాయాత్రలో భక్తులు



ఖమ్మం అర్బన్: హోమం నిర్వహిస్తున్న భక్త మండలి సభ్యులు



కూసుమంచి: నర్సింహులగూడెంలో దుర్గామాత ఊరేగింపు

అభ్యర్థుల ఎంపికపై అభిప్రాయ సేకరణ

కూసుమంచి: త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో మండలంలో కాంగ్రెస్ తరుపున పోటీ చేసే సర్పంచ్, ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపికపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు నాయకులు గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. పోటీ చేసేందుకు ఆశావహుల పేర్లను నమోదు చేసుకుని ఒకరిని ఎంపిక చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. సాధ్యమైనంత వరకు అభ్యర్థుల ఎంపికలో ఏకాభిప్రాయానికి కృషి చేస్తున్నారు. మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్, సీడీసీ చైర్మన్ ఎరబోలు సూర్యనారాయణరెడ్డితో పాటు మాజీ ఎంపీపీలు జూకూరి గోపాలరావు, ఎడవెల్లి ముత్తయ్య, కాంగ్రెస్ నాయకులు ఎండీ హాఫీజుద్దీ న్, జొన్నలగడ్డ రవికుమార్, బజ్జూరి వెంకటరెడ్డి, బొల్లంపల్లి సుధాకర్‌రెడ్డి, కంచర్ల జీవన్‌రెడ్డి తదితరుల పర్యవేక్షణలో అభ్యర్థుల ఎంపిక చేపట్టారు.



గట్టుసింగారంలో మాట్లాడుతున్న మార్కెట్ చైర్మన్ హరినాథ్

ప్రతీ పంచాయతీలో కాంగ్రెస్ జెండా ఎగరాలి

నేలకొండపల్లి: ప్రతీ పంచాయతీలో కాంగ్రెస్ జెండా ఎగరాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో కాంగ్రెస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మంగాపురంతండాలో సర్పంచ్ అభ్యర్థిగా భూక్యా గోబ్రియా, ఎంపీటీసీ అభ్యర్థిగా తేజావత్ విజయలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ధీరావత్ బాలాజీ, కోటేశ్వరరావు, ధీరావత్ రాధాకృష్ణమూర్తి, భూక్యా రాజా శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఏఈ బదిలీపై చర్చలు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం సర్కిల్ పరిధిలోని ముదిగొండ విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ) ఎం.శ్రీనివాస్ బదిలీ వ్యవహారంపై శనివారం ఎన్పీడీసీఎల్ వరంగల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉన్నతాధికారులతో ఉద్యోగ ప్రతినిధులు చర్చలు జరిపారు. విద్యుత్ అంతరాయం వ్యవహారంపై ఏఈపై బదిలీ వేటు వేయడం సమంజసంకాదని పేర్కొంటూ బీసీ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ నిరసన కార్యక్రమానికి నిర్ణయించిన క్రమాన ఎన్పీడీసీఎల్ ఉన్నతాధికారులు విషయాన్ని చర్చించేందుకు అసోసియేషన్ కంపెనీ ప్రతినిధులకు అవకాశం కల్పించింది. శనివారం ఉద్యోగుల అసోసియేషన్ కంపెనీ ప్రతినిధులు ఏఈ బదిలీ చర్య సరైందికాదని తమ వాదనను వినిపించారు. ఉద్యోగ ప్రతినిధుల వాదనలు విన్న కంపెనీ అధికారులు పూర్వాపరాలు పరిశీలించి తగిన నిర్ణయం తీసుకుంటామని సర్ది చెప్పినట్లు సమాచారం. ఉద్యోగుల చర్చల నేపథ్యాన స్థానిక ఉద్యోగుల అసోసియేషన్ నిరసన కార్యక్రమాన్ని విరమించుకున్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

తిరుమలాయపాలెం: స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం సత్తా చాటాలని పార్టీ మండల కార్యదర్శి శ్రీను అన్నారు. శనివారం మండలంలోని ఎదుళ్లచెరువు, పిండిప్రోలు, హైదర్‌సాయిపేట, పాపాయిగూడెం తదితర గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి మాట్లాడారు. రాబోయే ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికలకు పార్టీ కార్యకర్తలు సమాయత్తమై ప్రజల కోసం పనిచేసే అభ్యర్థులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. మండలంలో గత నాలుగేళ్లుగా స్థానిక, ప్రజల సమస్యలపై గళమెత్తిన పార్టీ సీపీఎం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుళ్లూరు నాగేశ్వరరావు, వేగినాటి వెంకటరావు, పులకాని వెంకటనర్సయ్య, మంగతాయి, నిర్మల్‌రావు, ఆనందరావు, సురేష్, బాబురావు, ఉపేందర్, మహేందర్, వీరభద్రం, ఉమేష్, ఇమామ్, విజయపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎదుళ్లచెరువులో మాట్లాడుతున్న కొమ్ము శ్రీను

రక్తదానంపై అవగాహన కల్పించాలి

ఖమ్మంవైద్యవిభాగం: నగరంలోని వైరా రోడ్డులో రితన్య ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన రితన్య వలంటరీ బ్లడ్ సెంటర్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి బి.కళావతిబాయి శనివారం ప్రారంభించారు. బ్లడ్ సెంటర్‌లో మిషనరీలు, ఇతర పరికరాలను పరిశీలించిన ఆమె నిర్వాహకులతో మాట్లాడారు. ప్రమాదాల బారిన పడిన వారితో పాటు తలసేమియా చిన్నారులకు రక్తం అందించాల్సిన పరిస్థితులు ఉన్నందున రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, రక్తదాన ప్రాముఖ్యతపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. వలీవ్ క్రిఫ్టో సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చైర్మన్ జి.భారవి, జి.సుజాత, ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రెహాన బేగం, డాక్టర్ కోటేశ్వరరావు, వైద్యుడు గొంగూర వెంకటేశ్వరరావులు పలు విభాగాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ నారాయణమూర్తి, డాక్టర్ లక్ష్మీదీప, సంకల్ప సంస్థ సంయుక్త కార్యదర్శి కస్తూరి, ఉపాధ్యక్షురాలు పి.పావని, కోశాధికారి పి.రవిచందర్, పి.ఉదయ్‌భాస్కర్, అనిత, తదితరులు పాల్గొన్నారు.



బ్లడ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

నూతన కమిటీ ఎన్నిక



రెహానా బేగం

ఖమ్మంవైద్యవిభాగం: నగరంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా డాక్టర్ రెహానా బేగం, డాక్టర్ కోటేశ్వరరావు, కోశాధికారిగా కూరపాటి ప్రీతిలను ఎన్నుకున్నారు. ఈమేరకు నూతన కార్యవర్గాన్ని పలువురు వైద్యులు అభినందించారు.

జిల్లా చెస్ జట్ల ఎంపిక..



బాలికల విజేతలకు బహుమతులు అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు



బాలుర విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ ఎంపికలను శనివారం నగరంలోని త్రివేణి పాఠశాలలో నిర్వహించారు. ఈ ఎంపికలకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అండర్–15 బాలబాలికలకు పోటీలు వేర్వేరుగా నిర్వహించి గెలుపొందిన వారికి త్రివేణి పాఠశాలల కరస్పాండెంట్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్రచౌదరీ, ఉమ్మడి జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి సీహెచ్.గోపి కృష్ణ, జోత్స్న, ప్రిన్సిపాల్ పి.రాజేంద్రప్రసాద్‌లు విజేతలకు బహుమతులు అందజేయగా.. జిల్లా జట్టుకు ఎంపికై వారిని కార్యదర్శి ప్రకటించారు. బాలికల జట్టులో పి.రీతు, ఎస్.భావజ్ఞ, జె.శ్రీకల, జి.హర్షిత, బాలుర విభాగంలో వి.అకాజ్, అనీష్, మోక్షిత్, అయుష్మాన్, కె.హరిహత్‌లు ఉన్నారు.త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కాగా, పి.ఈశ్వర్, డి.మ్యాథ్యూస్, సీహెచ్.గౌతమ్ కృష్ణ, ఎ.శ్రీరామ్, శివనాగసాయి, కేతన్‌లు ప్రత్యేక బహుమతులు గెలుచుకున్నారు.

బీజేపీ నాయకుల పరామర్శ

కూసుమంచి: పాలేరు గ్రామానికి చెందిన మిషన్ భగీరథ ప్రాజెక్టు కార్మికుడు చందనబోయిన గాంధీ ఇటీవల ఆత్మహత్య చేసుకోగా.. ఆదివారం ఆయన కుటుంబాన్ని బీజేపీ నాయకులు పరామర్శించి నివాళులర్పించారు. కాంట్రాక్టర్ సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో గాంధీ ఆత్మహత్యకు పాల్పడ్డాడని, ఇందుకు ప్రభుత్వం బాధ్యత వహిస్తూ అతడి కుటుంబానికి రూ.5లక్షల పరిహారంతో పాటు ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షురాలు చందనబోయిన పుణ్యవతి, నాయకులు గుండా ఉపేందర్‌రెడ్డి, హటియా నాయక్, బెల్లం మురళీ, దాసరి వెంకన్న, గడ్డం వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, ఉపేందర్ నాయుడు, వీరన్న, మహేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి సంబురం..



ధర్మాతండాలో పూర్తికావొచ్చిన ఇల్లు



గట్టుసింగారంలో నిర్మాణంలో ఉన్న ఇల్లు

శరవేగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

- శాండ్‌బజార్‌తో తీరుతున్న ఇసుక కష్టాలు
- టన్ను రూ.1,100లతో విక్రయాలు
- ఇంటికి నాలుగు టన్నుల చొప్పున పంపిణీ

కూసుమంచి: పేదలకు పక్కా ఇళ్లు ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఇందిరమ్మ ఇళ్ల పథకం కూసుమంచి మండలంలో శరవేగంగా అమలవుతోంది. ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తిచేసుకుంటూ పేదలు వారి సొంతింటి కలను నెరవేర్చుకుంటున్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పేదలకు లక్షలాది ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయగా.. ఆ తర్వాత తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు జోరందుకున్నాయి. తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో పాలేరు నియోజకవర్గంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు వేగంగా శరవేగంగా సాగుతున్నాయి.

తొలి విడతలో 717 ఇళ్లు..

మండలంలో తొలి విడతలో 717 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో 58 గృహాలు స్లాబ్‌లెవల్‌లో పూర్తి కాగా 186 స్లాబు దశలో, మిగిలినవి లెంటల్ లెవల్‌లో ఉన్నాయి. మొదట విడత ఇళ్ల నిర్మాణాలు వేగంగా సాగుతుండగా.. ఈలోగా రెండవ విడత ఇళ్లు వచ్చే అవకాశాలు ఉండడంతో మరి కొందరికి ఇంటి భాగ్యం దక్కనుంది. కాగా, లబ్ధిదారులకు ప్రభుత్వం నిర్దేశించిన స్థలంలో తమకు నచ్చిన మోడల్‌లో నిర్మించుకునే అవకాశం కల్పించగా.. తమ అభిరుచి మేరకు ఇళ్లను నిర్మించుకుంటున్నారు.

తీరుతున్న ఇసుక కష్టాలు...

ఇక ఇందిరమ్మ గృహ లబ్ధిదారులకు ఇసుక కొరత తీర్చేందుకు ప్రభుత్వం శాండ్(ఇసుక) బజార్‌లను ఏర్పాటు చేయగా జిల్లాలో తొలి శాండ్ బజార్‌ను కూసుమంచి మండల కేంద్రంలోనే ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గోదావరి నుంచి ఇసుకను తెప్పించి నిలువ చేశారు. లబ్ధిదారులకు సంబంధిత ఏఈ సిఫార్సుతో కూపన్ల ద్వారా రూ.1,100కు టన్ను ఇసుక చొప్పున ఒక్కో ఇంటికి నాలుగు టన్నుల అందించనుండగా ఇట్టి ఇసుకను మహిళా సమాఖ్యల ద్వారా విక్రయించనున్నారు.

ఇల్లు పూర్తయింది..



మాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరి కావటంతో ఇల్లు మొదలు పెట్టాము. ఇల్లు స్లాబ్ పూర్తి అయి ప్లాస్టింగ్ కూడా చేశాము. మాకు నచ్చిన మోడల్‌లో కట్టుకున్నాము. మాకు స్వంత ఇంటి కల ఈ ప్రభుత్వంలో నెరవేరింది. ప్రభుత్వానికి రుణపడి ఉంటాము.

– జర్పుల సుమలత, ధర్మాతండా

ఇబ్బంది పడ్డాం..



మాకు ఉన్న రేకుల ఇంటితో ఇన్నేళ్లు చాలా ఇబ్బంది పడ్డాం. మాకు ఇందిరమ్మ పథకంలో ఇల్లు వచ్చింది. ఇల్లు నిర్మించుకుంటున్నాం. ప్రభుత్వం రూ.5లక్షలు సాయం చేస్తుంది.ఈ ప్రభుత్వం వలనే మాకు డాబా ఇల్లు కట్టుకునే అవకాశం వచ్చింది.

– శీలం ఉపేందర్, గట్టుసింగారం